

ఐటీడీఏలో నేడు టీచర్ల బదిలీలకు కౌన్సిలింగ్

సీతంపేట రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, జీపీఈఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. కాగా స్థానచలనం కోసం మొత్తంగా 244 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీడీ అన్నదొరల ఆధ్వర్యంలో బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. 30న ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో, నాలుగో తరగతి ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని డీడీ తెలిపారు. 31న ఎస్‌జీటీ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

ఖరీఫ్‌నకు సన్నద్ధం





● 2.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయనున్నట్లు అంచనా
● విత్తనాలు, ఎరువుల సరఫరాకు వ్యవసాయశాఖ సిద్ధం

పార్వతీపురం/పాలకొండ, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు, ఎరువుల సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు పక్కా ప్రణాళికలు రూపొందించారు. వాస్తవంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు 2.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టనున్నట్లు అధికారులు భావిస్తున్నారు.ఇందులో లక్షా 79 వేల 478 ఎకరాల్లో వరకు వరి సాగు చేయనున్నట్లుఅంచనా వేస్తున్నారు.దీని కోసం 26 వేల 470 క్వింటాళ్ల వరి విత్తనాలను రాయితీపై సరఫరా చేయనున్నారు. 9,092 క్వింటాళ్ల వరి విత్తనాలను 90 శాతం రాయితీపై గిరిజన రైతులకు అందించనున్నారు. ఇకపోతే జిల్లాలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో ఎద పద్ధతిలో వరి సాగు జరగనున్నట్టు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. కాగా గతేడాది ఖరీఫ్‌లో రెండు లక్షల 20 వేల 395 ఎకరాల్లో వరి సాగు చేపట్టాల్సి ఉండగా.. రెండు లక్షల 12 వేల 319 ఎకరాల్లో వరితో పాటు ఇతర పంటలను పండించారు.



రాయితీపై సరఫరా చేసే విత్తనాలు ..

ఎంటీయూ-1064 రకం 11,750 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం 5,987 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 2617 క్వింటాళ్లు, ఎంటీయూ 1061రకం 1250 క్వింటాళ్లు , బీపీటీ3291 రకం 1050 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 980 క్వింటాళ్లు, ఎంటీయూ7029 రకం 965 క్వింటాళ్లు, ఎంటీయూ1318రకం 880 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 15048 రకం 461 క్వింటాళ్లు, ఎన్ఎల్ 34449 రకం 220 క్వింటాళ్లు, ఎంటీయూ1224 రకం 180 క్వింటాళ్లు,

(మిగతా 8వ పేజీలో...)

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

చిరుధాన్యాలైన రాగి, కొర్ర, మినుము, పెసర, కందితో పాటు వేరుశనగ తదితర విత్తనాలను కూడా సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా18 వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగుకు 1899 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై సరఫరా చేయనున్నారు. వరి పొలం గట్లపైకంది సాగుకు కూడా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయనున్నారు.ఖరీఫ్ సీజన్‌లో 5 వేల పీఎండీఎస్ కిట్లు (నాలుగు కేజీల జనుము, నాలుగు కేజీల జీలుగు, రెండు కేజీల పిల్లిపెసర) సరఫరా చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో 1610 కిట్లు అందుబాటులో ఉన్నాయి.

సజావుగా హెచ్‌ఎంల పదోన్నతుల ప్రక్రియ

సాలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పాఠశాల సహాయకుల నుంచి గ్రేడ్ టు ప్రధానోపాధ్యాయుల పదోన్నతి కౌన్సిలింగ్ గురువారం విజయనగరం బాలికోన్నత పాఠశాలలో సజావుగా జరిగింది. వారంతా ఉదయం 8 గంటలకు కౌన్సిలింగ్ హాల్‌కు చేరుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల సాయంత్రం ప్రక్రియ ఆరంభమైంది. రాత్రి ఏడు గంటల వరకు కౌన్సిలింగ్ జరిగింది. విజయ నగరం డీఈవో మాణిక్య నాయుడు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో చినమేరంగి, బీజే పురం, చినకుదమ, గరుగుబిల్లి, ఎన్.ములగ, శంబర, కోన, మక్కువ, బూర్జ, అజ్జాడ, నారాయణపురం, అరసాడ, గళావిల్లి, ఉద్దవోలు, వెలగవలస, బిళ్లలవలస, గర్భాం, కె.కృష్ణాపురం, ఆర్సీ పురం, మరడాం, దత్తి, దత్తిరాజేరు, పీఎం పల్లి, పోరాం, ఆంద్ర, జయితి, పెదబంటు పల్లి, వేదుళ్లవలస, బొండపల్లి, కాపుశంభాం, చీపురుపల్లి, కర్లాం, పేరిపి, పెదనడిపల్లి, పాలవలస , గుంపాం, గోవిందపురం, చింతపల్లి, కోనాడ, ఎన్‌కేఆర్ పురం (ఏజీఆర్), కొట్యాడ, చందూలూరు, కంటకాపల్లి, బుదరాయవలస జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హెచ్‌ఎంల పోస్టులకు గాను పాఠశాల సహాయకులకు పదోన్నతులు ఇచ్చారు.

మూడోరోజు మహానాడులో...

పార్వతీపురం, మే 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మూడో రోజు గురువారం జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆఖరి రోజు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులతో కాసేపు మాట్లాడారు. మహానాడు కమిటీలను అభినందించారు.

పూర్తి వివరాలు 6వ పేజీలో..





చిన్నపాటి వర్షానికే..

● రహదారిపై నిలుస్తున్న నీరు
● ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు
● పెసర, నువ్వు, మొక్కజొన్న పంటల సంరక్షణకు రైతుల పాట్లు

8లో



ఉపాధి బిల్లులు చెల్లించాలి

● బలిజిపేటలో వేతనదారుల నిరసన

8లో

కదలవు.. వదలవు!

● పిట్టలమెట్టలో గజరాజుల సంచారం



గరుగుబిల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): జోరుగా వర్షాలు కురుస్తుండడంతో మండలం నుంచి గజరాజులు కదలడం లేదు. బుధవారం నందివానివలసలో సంచరించిన ఏనుగులు గురువారం సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్టకు చేరుకున్నాయి. ఆ ప్రాంతంలో చెరకు, మొక్కజొన్న, అరటి, పామాయిల్ పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అవి గ్రామాల్లోకి, ప్రధాన రహదారిపైకి రాకుండా చూడాలని కోరుతున్నారు.

ఆ కష్టాలకు చెక్!

● డీఆర్ డిపోలో రేషన్ సరుకుల పంపిణీ ● ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
● గిరిజనులకు తప్పనున్న కష్టాలు ● జీసీసీకి పునరుత్తేజం

సీతంపేట రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల నుంచి రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఎండీయూ వాహనాల ద్వారా గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. కాగా సర్కారు ఆదేశాలతో ఏజెన్సీలో డీఆర్ డిపోల ద్వారా సరుకుల పంపిణీకి జీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. పాత పద్ధతిలోనే సరుకుల సర ఫరాకు చర్యలు చేపడుతోంది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం (ఎండీయూ) వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేప ట్టింది. అయితే సరుకుల సరఫరాలో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈ పద్ధతికి ఫుల్ స్టాప్ పెట్టింది. ఇకపై జీసీసీ డీఆర్ డిపోల ద్వారా సరుకుల పంపిణీకి ఉత్తర్వులు విడుదల చేయడంతో ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.


గిరిజనులకు తప్పనున్న ఇక్కట్లు

సీతంపేట గిరిజన సహకార సంస్థ డివిజన్ పరిధిలో మొత్తంగా 36 డీఆర్ డిపోలు ఉన్నాయి. సీతంపేట మండలంలో 23, భామిని 7, కొత్తూరు 4, మర్రిగూడ 1, వీరఘట్టంలో ఒకటి చొప్పున ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 22,856 రేషన్ కార్డుదారులు ఉన్నారు. అయితే సీతంపేట మన్యంలో సిగ్నల్ వ్యవస్థ లోపం కారణంగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీలో ఇబ్బందులు తలెత్తేవి. సిగ్నల్ ఎక్కడైతే వస్తుందో అక్కడే ఎండీయూ వాహనాలను నిలుపుదల చేసి గిరిజనులకు రేషన్ అందజేసేవారు. దీంతో ప్రతినెలా గిరిజనులకు ఇబ్బందులు తప్పేవి కావు. కొండ దిగువ ప్రాంతానికి నడిచి వచ్చి

(మిగతా 8వ పేజీలో...)



ఎండీయూ వాహనం వద్ద రేషన్ కోసం వేచి ఉన్న గిరిజనులు (ఫైల్)



సామరెల్లి గ్రామంలోని జీసీసీ డీఆర్ డిపో

సాగునీరు అందించేలా చర్యలు

● సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తోటపల్లి కాలువలు, రైతుల సమస్యలపై గురువారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 'తోటపల్లి బ్యారేజ్ వద్ద పాత కుడి, ఎడమ కాలువలకు షట్టర్లు సరిగా పనిచేయడం లేదు. దీని వల్ల నీటి ప్రవాహాన్ని నియంత్రించలేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.' అని రైతు సంఘం నాయకులు తెలిపారు. దీనిపై జల వనరులశాఖ డీఈఈ గనిరాజు మాట్లాడుతూ.. రూ.16 లక్షలతో షట్టర్లు ఏర్పాట్లుకు సాంకేతికపరమైన అనుమతులు వచ్చాయన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు విడుదల చేసే నాటికి సమస్య పరిష్కరిస్తాని వెల్లడించారు. కాలువల్లో పూడికలు, తుప్పలు, డొంకలను తొలగించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ప్రస్తుత కాలువపై ఉన్న కట్టడాలు కూలిపోయి ఉన్న కారణంగా శివారు వరకు సాగునీరు ఇచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. తోటపలి కడి, ఎడమ

(మిగతా 8వ పేజీలో...)



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

● హౌసింగ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ వెంకటరమణ

6లో



ఈ పుష్పాల అంద'మే' అందం!

జేఎన్‌టీయూలో యోగా శిక్షణ

● వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

7లో

యోగాతో జీవనాడులు ఉత్తేజం

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, మే29 (ఆంధ్రజ్యోతి): యోగాసనాలతో మానవ జీవనాడులు ఉత్తేజమవుతాయని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. గురువారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఆసనాలపై యోగా గురువు మోహన్ శిక్షణ ఇచ్చారు. ప్రాణాయామంతో పాటు వివిధ యోగాసనాలను వేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. 'ప్రస్తుత రోజుల్లో పని ఒత్తిడిని జయించి.. మానసిక ప్రశాంతత పొందేందుకు యోగా సాధన ఎంతగానో దోహదపడుతుంది. రోజూ ఆసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చు. ప్రతిఒక్కరూ యోగాపై ఆసక్తి చూపాలి.' అని కోరారు.



యోగా చేస్తున్న దృశ్యం

మొబైల్ టవర్ల నిర్మాణం పూర్తి చేయండి

● అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొబైల్ టవర్స్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. 'జిల్లాలో ఇంకా 16 మొబైల్ టవర్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. వడబాయి, ఊటకోసు, వనబడి, సూరపాడు, చోర గ్రామాల వద్ద రహదారుల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు జారీ చేశాం. వాటి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి. నిర్మాణాలు ఆలస్యమైతే సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం.' అని తెలిపారు. అటవీ ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించి ఆ శాఖ అనుమతుల జారీకి నిబంధనలు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత, డీఎఫ్‌వో ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రెండు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. రెండు లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అటవీశాఖ మొక్కలు పంపిణీ చేయాలన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉద్యాన, అటవీ, జలవనరుల తదితర శాఖలు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 38 శాతం పచ్చదనం ఉందని, దీనిని 50 శాతానికి పెంచడానికి వీలుగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

నేడు తోటపల్లిలో యోగాంధ్ర

తోటపల్లి ఐటీడీఏ పార్క్ వద్ద శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. జూన్ 5న సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో, 12న మక్కువ మండలం వీఆర్ఎస్ వద్ద ఉన్న ఏనుగుకొండ దగ్గర యోగాంధ్ర నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు.

అద్వితీయం

● ఫాంపాండ్ల నిర్మాణంలో జిల్లాకు ద్వితీయ స్థానం

సాలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఫాంపాండ్లు (వ్యవసాయ పంట కుంటలు) నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. 7506 ఫాంపాండ్లతో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానం దక్కించుకుంది. కాగా పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాల్లో 11,286 ఫాం పాండ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 6,307 ఫాం పాండ్లు నిర్మించారు. 847 ఫాంపాండ్లతో గుమ్మలక్ష్మీపురం తొలిస్థానంలో, 774తో కురుపాం ద్వితీయస్థానంలో, 665 నిర్మాణాలతో సీతంపేట మూడో స్థానంలో నిలిచాయి. సాలూరులో 417, పాచిపెంట 298, మక్కువ 344, బలిజిపేట 347, భామిని 314, గరుగుబిల్లి 307, జియ్యమ్మవలస 553, కొమరాడ 416, పాలకొండ 158, పార్వతీపురం 359, సీతానగరం 234, వీరఘట్టం మండలంలో 274 చొప్పున ఫాం పాండ్లు నిర్మించారు.



తుండలో ఫాంపాండ్ పనులు చేపడుతున్న దృశ్యం




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం






మహానందమాయే

కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో మూడో రోజు గురువారం ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు సందడి చేశారు. పార్టీ అధినేత చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను అభినందించారు. వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


చీపురుపల్లి: సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే కళావెంకటరావు


విజయనగరం: మహానాడు వేదిక వద్ద మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజుతో ఎమ్మెల్యే అదితి, నాయకులు


విజయనగరం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


కురుపాం: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్


ఎస్.కోట: ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


పార్వతీపురం: మంత్రి సంధ్యారాణితో సాలూరు నియోజకవర్గ నాయకులు


కురుపాం: మహానాడు వేదిక వద్ద కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు


ప్రధాన కుడి కాలువలో నీరు ఇలా...

'నారాయణపురానికి' జలకళ

సంతకవిటి, మే 29(ఆంధ్రజ్యోతి): రంగారాయిపురం వద్ద నాగావళిపై నారాయణపురం ఆనకట్ట జలకళను సంతరించుకుంది. వర్షాలు కురవడంతో నదిలోకి వరదనీరు చేరుతోంది. ఎగువ రిజర్వాయర్ల నుంచి నీటిని విడిచి పెడుతుండటంతో ఆనకట్టలో నీటిమట్టం పెరుగుతోంది. వైసీపీ హయాంలో ఇక్కడి ఆనకట్ట ఆధునికీకరణ పనులు చేపట్టడంతో విఫలమైంది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి వర్షాల ప్రభావంతో పనులకు ఆటంకం కలుగుతోంది. హెడ్ రెగ్యులేటర్ తలుపులు తొలగించారు. వాటి స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉంది. నదిలో నీటి ప్రవాహం పెరగడంతో పనులను నిలిపేశారు. దీంతో కుడి ప్రధాన కాలువలోకి అవసరం లేకున్నా నీటిని విడిచి పెడుతున్నారు.

ఈ పుష్పాల అందమే అందం!



శృంగవరపుకోట, మే 29(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలోని ఓ ఇంటి ఆవరణలో గురువారం మే పుష్పాలు కనువిందు చేశాయి. ఇవి అరుదుగా కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. కుంకుమ పువ్వు రంగుతో మెరిసిపోతున్న ఈ పూవులను చూసేందుకు పరిసర ప్రాంతాల వారు ఆసక్తి చూపిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జీఎం వెంకటరమణ

రామభద్రపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ పి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. ఆరికతోటలో అసంపూర్తిగా నిలిచిన జగనన్న కాలనీని ఆయన గురువారం సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. జూన్ 12న రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశాలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈలోగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు మంజూరు చేస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల నుంచి రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు అందించనున్నట్టు తెలిపారు. అలసత్వం ప్రదర్శిసే రద్దు చేయడమే కాకుండా రికవరీలు కూడా చేస్తామని హెచ్చరించారు. హౌసింగ్ బొబ్బిలి డివిజన్ డీఈ అప్పయ్య, ఏఈ మత్స వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయకాలనీలో వెలసిన దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సిందూర, తమలార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


స్వామివారిని తమలపాకులతో అలంకరించిన దృశ్యం

గట్టు విస్తరిస్తే మేలు

- రాజాం-డోలపేట మధ్య తగ్గనున్న రద్దీ
- తక్కువ ఖర్చు.. ఎక్కువ ప్రయోజనం
- విద్యార్థులు, రోగులకు ప్రయోజనం

రాజాం రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని రాజాం-డోలపేట మధ్య కిలోమీటరు పొడవు ఉన్న మల్లమ్మ చెరువు, గుర్రమ్మ చెరువు గట్లను విస్తరిస్తే ఈ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఇదే సమయంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్‌పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. డోలపేట, జి.ఎం.ఆర్.నగర్ ప్రాంతాలలోని ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ ఉన్న విద్యా సంస్థలతో పాటు కేర్ ఆసుపత్రికి రాకపోకలు సాగించే వందలాది మందికి ఎంతో మేలు కలగనుంది. దీంతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి, పాలకొండ ప్రాంతాల నుంచి రాజాం వచ్చే ద్విచక్ర వాహన చోదకులు ఈ మార్గం ద్వారా సులభంగా రాజాం చేరుకునే అవకాశం కలగనుంది. రెండు దశాబ్దాల కిందట వరకూ చెరువు గట్ల మీదుగా రాజాం-డోలపేట మధ్య రాకపోకలు సాగేవి. అయితే నీటి పారుదల శాఖ అనుమతితో గుర్రమ్మ చెరువులో కొంత భాగాన్ని కప్పి ఆర్టీసీ కాంప్లెక్స్, రైతుబజార్, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టడంతో ఈ రెండు చెరువులకు సంబంధించిన కిలోమీటరు పొడవునా గట్టు ఆక్రమణదారుల గుప్పెట్లోకి చేరింది. ఫలితంగా చెరువు గట్టు మీదుగా రాకపోకలకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో కిలోమీటరు పొడవునా చెరువు గట్టును అభివృద్ధి చేస్తే వందలాది మంది ట్రాఫిక్ జాంలో చిక్కుకోకుండా రాకపోకలు సాగిందేందుకు వెసులుబాటు కలగనుంది.

గతంలో ఇదే ప్రధాన మార్గం

రెండు దశాబ్దాల కిందట వరకూ డోలపేట పరిసర గ్రామాలకు చెందిన వారికి చెరువు గట్టే ప్రధాన మార్గంగా ఉండేది. సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు సైతం ఈ మార్గంలోనే వచ్చిపోయేవారు. ఈ రెండు చెరువుల్లో ఒకటి రాజాం మేజర్ పంచాయతీ పరిధిలోనిది కాగా, మరొకటి సారధి మేజర్ పంచాయతీ పరిధిలో ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో చెరువును కప్పివేసి బస్టాండ్‌తో పాటు రెండు మేజర్ పంచాయతీలు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టారు. కాలక్రమంలో బస్టాండ్ ప్రాంతం మినహా చెరువు గట్లలో కొంతభాగం కాలువ నిర్మాణం చేపట్టారు. మరికొంత భాగం ఆక్రమణలకు గురైంది.


రాజాం-డోలపేట మధ్య నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్)


అభివృద్ధి చేయాల్సిన చెరువు గట్టు ఇదే..

చిన్నపాటి ఆక్రమణలు తొలగించి సుమారు 20 అడుగులు వెడల్పు ఉన్న చెరువుగట్టును అభివృద్ధి చేస్తే వందలాది మందికి మేలు కలగనుంది.

ఎమ్మెల్యేపైనే ఆశలు..

ఈ ప్రాంతీయులంతా రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌పైనే గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో ఆయన హయాంలో రాజాం నియోజకవర్గంలో సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పుడు రాజాం-డోలపేట రహదారి పనుల కోసం రూ.9 కోట్లు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.6 కోట్ల బకాయిలు చెల్లించే ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చెరువు గట్టు అభివృద్ధిపై ఆయన దృష్టి పెట్టాలని స్థానికులు కోరారు.

జేఎన్‌టీయూలో యోగా శిక్షణ

విజయనగరం రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ (గురజాడ), వాటి అనుబంధ కళాశాలల్లో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు. వర్సిటీలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్లు ఆర్.గురునాథ్, పరీక్షల నియంత్రణ అధికారి జి.అప్పలనాయుడు, క్రీడల సమన్వయకర్త డాక్టర్ ఎ.వి.పాపారావు, యోగా బోధకుడు రవివర్మ తదతరులు ఉన్నారు

● జామి: మండలంలోని విజినిగిరి యోగాశ్రమంలో మూడు రోజులుగా యోగా శిక్షణ తరగతులు సందడిగా జరుగుతున్నాయి. గురువారం ఎంపీడీవో నాయుడు ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. సర్పంచ్ సూర్యారావు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్

జామి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్ కిట్ల పంపిణీని గురువారం ఎంఈవో-2 గంగరాజు ప్రారంభించారు. స్థానిక ఎంఆర్‌సీ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తున్నామని తెలిపారు.

నేడు రామనారాయణంలో 'యోగాంధ్ర'

విజయనగరం రింగురోడ్డు, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్రను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలో నాలుగు పర్యాటక ప్రాంతాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగానే రామనారాయణంలో జిల్లా యంత్రాంగం సుమారు 1500 మందితో యోగాసనాలు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

గంట్యాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటారుబిల్లిలో గల కనకదర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో 31న ఉదయం 8 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం అన్న సమారాధన చేయనున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.

విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి ఆహ్వానం

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కొండ వద్ద నిర్మించిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో 6న విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి హజరుకావాలని చినజీయర్‌స్వామిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆహ్వానించారు. గురువారం విశాఖలోని త్రిదండి చినజీయర్‌స్వామి ఆశ్రమంలో చినజీయర్‌స్వామిని ఎమ్మెల్సీ కలిశారు.


చినజీయర్ స్వామిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ

గ్రంథాలయాలతో బాలల వికాసం

విజయనగరం బాబామెట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు బాలల వికాసానికి తోడ్పతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మేకా అనంతలక్ష్మి, జిల్లా శాఖ కార్యదర్శి సుభద్రాదేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి కళావతి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో గ్రంథాలయ కార్యదర్శి లక్ష్మి

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

విజయనగరం దాసన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీ క్లబ్‌లో గురువారం పుణ్యశ్లోక రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాణి అహల్యాబాయి భారత్‌లో ఎన్నో దేవాలయాల నిర్మాణం చేయించారన్నారు. ప్రజాసేవలో ఆమె తరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి పావని, లక్ష్మీనరసింహం, కుసుమంచి సుబ్బారావు, నారాయణరావు, నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి రాకెట్లు

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరంలో శిక్షణ పొందుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి భరణికాన హరికకు సాఫ్టవేర్ ఇంజనీర్ దేవికారాణి రూ.5వేలు విలువ చేసే యోనెక్స్ రాకెట్లు అందజేశారు. దేవికారాణి కూడా ఇక్కడ గతంలో బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందారు. గురువారం తండ్రి కిరణ్‌తో కలిసి వేసవి క్రీడా శిబిరానికి వచ్చి క్రీడా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. జూనియర్స్, సబ్‌జూనియర్స్‌గా విభజించి చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు పోటీలు నిర్వహించారు.

ఈవీఎం గోదాంల పరిశీలన

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈవీఎం గోదాములను కలెక్టర్ అంబేడ్కర్ గురువారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించారు. సెక్యూరిటీ ఏర్పాట్లపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులు, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జి ఆర్డీవో టి.సవరమ్మ, ఇన్‌చార్జి తహసీల్దారు రవిశంకర్, కలెక్టరేట్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శేఖర్ ఉన్నారు.



గోదాం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

మారుమూల పల్లెలకు రహదారి సౌకర్యం

గుర్ల, మే 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మారుమూల పల్లెలకు సైతం తారు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నదే కేంద్ర ప్రభుత్వం ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ అన్నారు. గురువారం పల్లిగండ్రేడు పంచాయతీ రాజులపేటకు రూ.55 లక్షల ఉపాధి హామీ నిధులతో మంజూరైన బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రోడ్డు కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఎట్టకేలకు బీటీ రోడ్డు ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో జంపాన సూర్యనారాయణరాజు, మజ్జి రామారావు, సర్పంచ్ పెనుమల శంకరయ్య, మజ్జి ఆదినారాయణ పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రజలకు అండగా బీఎస్పీ

విజయనగరం దాసన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రజలకు అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని కంటోన్మెంట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు అధ్యక్షతన బహుజన సంకల్పసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బహుజన సమాజ్ పార్టీని ఏ శక్తి కూడా విచ్ఛిన్నం చేయలేదన్నారు. యూపీలో రి మాయావతి అధికారంలోకి రాగానే 16 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని బహుజనులకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జె.మల్లికల్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను బహుజనులకు సమానంగా అందనీయకుండా చేస్తున్న మనువాద పార్టీలను గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోని కృష్ణ, సోములు, శివప్రసాద్, గౌరిరీ, పైడిరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దత్తిరాజేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మానాపురం రైల్వేగేటు సమీపంలో గురువారం హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా జమున బహల్ తాలూకా దాదాపూర్ గ్రామానికి చెందిన సునీల్ బిస్వాల్ (46) మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.6.90 లక్షల జరిమానా

విజయనగరం క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన 69 డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.6.90 లక్షల జరిమానా విధిస్తూ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి ఎంఎస్‌హెచ్ఆర్ తేజాచక్రవర్తి గురువారం తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటన తెలిపారు. ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 69 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారని ఎస్పీ పేర్కొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లెపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం దాడి చేశామని నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15 వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జిందాల్ నిర్వాసితుల సమావేశం వాయిదా

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెద్దల నుంచి సానుకూల సమాచారం అందడంతో గురువారం జరగాల్సిన జిందాల్ భూ నిర్వాసితుల సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితుల భూ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామన్నారు. 17 సంవత్సరాల క్రితం ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చిన్న, సన్నకారు గిరిజన రైతులు జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చారన్నారు. పరిశ్రమ నిర్మాణం లేకపోవడంతో ఉద్యోగాలు రాక, ఎటూ వెళ్లలేక యువత సందిగ్ధంలో ఉందన్నారు. షేర్ హోల్డర్‌లుగా ఉన్న రైతులకు పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులు చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు, ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఇక్కడ యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అప్పట్లో భూములు ఇప్పించామన్నారు. ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నామని ఎమ్మెల్సీ అన్నారు.

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

శృంగవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణకు 18 నుంచి 30 ఏళ్ల లోపు యువత అర్హులన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ పూర్తి చేసినవారు జూన్ 4లోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 7995691295ను సంప్రదించాలన్నారు.

మత మార్పిడిలను అరికట్టండి

లక్కవరపుకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగుతున్న మత మార్పిడిలను అరికట్టాలని హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సమరసత సేవాఫౌండేషన్ జోనల్ అధికారి ఎ.గంగాధర్ అన్నారు. గురువారం ఎల్.కోటలో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలవంతపు మత మార్పిడిలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాల పరిరక్షణ, విగ్రహారాధన పెరగాలన్నారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ కోసం పలువురు మాట్లాడారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు స్థలపరిశీలన

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీలుగా చంపావతిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తెలిపారు. గురువారం నగర పంచాయతీ అధికారులతో పాటు విజయనగరం నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్ అధికారులు చంపావతి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు ప్రాధ్యానంపై ఇటీవల నిర్వహించిన జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి వివరించారు. అందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. దాంతో నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్, పబ్లిక్ హెల్త్ ఈఈ ఎస్.జ్యోతి, డీఈఈ బి.ఈశ్వర్, ఏఈ మణికంఠ, ఇరి గేషన్ డీఈఈ గోవిందరావు తదితరులు చంపావతి తీరాన్ని పరిశీలించారు.


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

గజపతినగరం, మే29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. ఇళ్లు, ఇళ్ల పట్టాల మంజూరు కోసం జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న నిరసనకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం స్థానిక వినాయక ఆలయం ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల రామునాయుడు, శ్రీను, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గెడ్డలో మొక్కల తొలగింపు

లక్కవరపుకోట, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం రెవెన్యూ పరిధిలోని కోటవాని చెరువు గెడ్డలో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. 'గెడ్డపై గెద్దలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారణకు వచ్చారు. తహసీల్దారు ఆదేశాల మేరకు గురువారం కల్లేపల్లి, శ్రీరాంపురం వీఆర్వోలతో పాటుగా ఆర్ఐ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఆక్రమిత భూమిలో వేసిన సరుగుడు మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు. ఆక్రమణ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.


మొక్కలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోస్తనీ తీరంలో ట్రెంచ్‌లు

శృంగవరపుకోట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలపల్లి సమీపం గోస్తనీ తీరంలో జామి మండలం తానవరం, దిగువ గ్రామాలకు నీరు వెళ్లే సాగుకాలువ వద్ద గురువారం ట్రెంచ్ తవ్వకాలు చేపట్టారు. గోస్తనీ తీరంలో ఇసుక అక్రమ తవ్వకాల నేపథ్యంలో సాగునీటి కాలువను పూడ్చేసిన విషయాన్ని స్థానిక రైతులు తహసీల్దారు అరుణకుమారికి ఇటీవల ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె.. ఆర్ఐ మనోజ్‌కుమార్, వీఆర్వో గణేశ్‌లను విచారణకు పంపారు. అక్కడ విషయాన్ని గుర్తించిన ఆర్ఐ.. ట్రెంచ్ తవ్వకం అవసరాన్ని గుర్తించారు. దాంతో గురువారం అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు.


ట్రెంచ్‌లు తవ్విస్తున్న అధికారులు

కుళాయి అక్రమ కనెక్షన్లపై కమిషనర్ సీరియస్

- మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

నెల్లిమర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో కుళాయి అక్రమ కనెక్షన్ల వ్యవహారంపై నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై తాడో పేడో తేల్చాలని నిర్ణయించారు. డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా ఏళ్ల తరబడి 267 కుళాయి కనెక్షన్లు వినియోగించడాన్ని తీవ్రంగా పరిగణించారు. 'నెల్లిమర్లలో కలకలం' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నగర పంచాయతీలోని వార్డు ఎమినిటీస్ కార్యదర్శులతో తన చాంబర్‌లో గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూడు రోజుల్లో అక్రమ కనెక్షన్ల నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఇప్పటికే 267 అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినా విచారణ చేపడితే ఆ సంఖ్య 400కు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రతి వార్డులో కనక్షన్లు ఎన్ని? ఇంటి యజమానులు ఎవరు? గతంలో డిపాజిట్ సొమ్ము చెల్లించారా? చెల్లిస్తే ఎవరికి ముట్టజెప్పారు? అనే విషయాలపై ఆరా తీయాలని కార్యదర్శులను ఆదేశించారు. సదరు ఇంటి యజమానుల నుంచి లిఖిత పూర్వకంగా వివరాలను రాబెట్టాలని కూడా కార్యదర్శులకు సూచించారు. డిపాజిట్ సొమ్ము పక్కదారి పట్టినా, చేతులు మారినా సంబంధిత ఉద్యోగులపై చర్యలకు సైతం వెనుకాడకూడదనే ఆలోచనతో ఉన్నారు. ఒక వైపు లక్షలాది రూపాయిలు డిపాజిట్ సొమ్ముతో పాటు సంవత్సరాల తరబడి నగర పంచాయతీ పన్నుల రూపంలో నష్టపోయిన అంశాన్ని కూడా కమిషనర్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. రెండు రోజుల్లో అక్రమ కనెక్షన్లను బంద్ చేయాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

చెరువులో వ్యర్థాల తొలగింపు

భోగాపురం, మే29(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గంగిరావి చెరువులో వ్యర్థాలను ఎట్టకేలకు గురువారం పంచాయతీ పాలకులు తొలగించే ఏర్పాటు చేశారు. గంగిరావి చెరువువ్యర్థాలతో నిండటంతో 'గుండె చెరువు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. దాంతో చెరువులో వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

చెరువులో వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు



ఖరీఫ్‌నకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

ఎంటీయూ 1232 రకం 8 క్వింటాళ్లు , ఎంటీయూ1262 రకం 50 క్వింటాళ్ల రైతుల సేవా కేంద్రాల ద్వారాసరఫరా చేయనున్నారు. వాటిలో 17,378 క్వింటాళ్లు రాయితీ పద్ధతిలోను, 9,092 క్వింటాళ్లు గిరిజనులకు 90 శాతం రాయితీతోనూ విత్తనాలు సరఫరా చేయనున్నారు.

ఎరువుల పంపిణీకి సన్నద్ధం

ఖరీఫ్-2025 సీజన్ కోసం 45,276 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరాకు ప్రతిపాదనలు చేశారు. మొదటిగా ఆరు వేల టన్నుల బఫర్ నిల్వలను మార్క్‌ఫెడ్‌లో సిద్ధం చేశారు. మార్క్‌ఫెడ్ నుంచి మరో 15 వేల టన్నుల ఎరువులను సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా హోల్‌సేల్ వ్యాపారులు, మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలర్లు, పీఏసీఎస్, ఆర్ఎస్‌కేల వద్ద 6,039 మెట్రిక్ టన్నుల యూరియా, 1913 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1055 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులతో పాటు 399 మెట్రిక్ టన్నుల ఎంవోపీ , 819 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు ఉన్నట్టు వ్యవసాయాధికారులు ప్రకటించారు. మొత్తంగా 10,225 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

ప్రణాళిక సిద్ధం

జిల్లాకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కోసం ఇండెంట్ పెట్టాం. ఖరీఫ్‌కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రైతులకు అవసరమైన సేవలు పూర్తిస్థాయిలో అందిస్తున్నాం.

- రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం

ఆ కష్టాలకు చెక్!

(5వ పేజీ తరువాయి)

గంటల తరబడి వేచి ఉండేవారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గిరిశిఖర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు ఇక్కట్లు తప్పనున్నాయి. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోగా నేరుగా డీఆర్ డిపోలకు వెళ్లి రేషన్ సరుకులను పొందొచ్చు.

జీసీసీకి పూర్వవైభవం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన జీసీసీ(గిరిజన సహకార సంస్థ)కి కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పునరుత్తేజం రానుంది. గడిచిన నాలుగేళ్లుగా ఎటువంటి కార్యకలాపాలు లేక వెలవెలబోయిన జీసీసీకి జవసత్వాలు రానున్నాయి. కూటమి ప్రభుత్వంలో గిరిజన సహకార సంస్థ కార్యాలయాలు, కార్యాలయ సిబ్బంది, డీఆర్ డిపోలు ఇకపై యాక్టివ్‌గా పనిచేయనున్నాయి. జీసీసీ డీఆర్ డిపోల ద్వారా ఇకపై గిరిజనులకు రేషన్ సరుకులు పంపిణీ చేయడంతో అక్రమాలకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. ఎండీయూ వాహనాల ఆపరేటర్లపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళ్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

డీఆర్ డిపోల పరిస్థితి ఇలా..

సీతంపేట జీసీసీ డివిజన్ పరిధిలో ఉన్న డీఆర్ డిపోల పరిస్థితి అధ్వానంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించకపోవడంతో 36 డీఆర్ డిపోల్లో 20కి పైగా భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఈ డిపోల్లో బియ్యం, పంచదార, ఆయిల్ ఇతరాత్ర నిత్యావసర సరుకులు నిల్వ చేయడం తలకుమించిన భారమే. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో వాటి మరమ్మ తులకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక జీసీసీలో సేల్స్‌మెన్ కొరత కూడా తీవ్రంగా ఉంది. రెగ్యులర్ సేల్స్‌మెన్ ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఎడిషనల్ చార్జి ముగ్గురు, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పది మంది, ఇన్‌చార్జి సేల్స్‌మెన్ నలుగురు, ఎస్‌హెచ్‌జీ ముగ్గురు, డీలర్‌లు 11 మంది ఉన్నారు. వీరిలో కొందరు సేల్స్‌మెన్ రెండు డీఆర్ డిపోలకు ఒక్కరు చొప్పున సేవలు అందిస్తున్నారు.

జీసీసీ బీఎం ఏమన్నారంటే..

'ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి జీసీసీ డీఆర్ డిపోల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నాం. కొన్ని డీఆర్ డిపోలకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన ప్రాంతాల్లోని రేషన్ కార్డుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిత్యావసర సరుకులు అందిస్తాం.' అని సీతంపేట జీసీసీ బ్రాంచ్ మేనేజర్ డి.కృష్ణారావు తెలిపారు.

సాగునీరు అందించేలా చర్యలు

(5వ పేజీ తరువాయి)

కాలువల పరిధిలో 31 మంది లస్కర్ల అవసరం ఉందని తోటపల్లి కాలువల సాధన సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తానని సబ్ కలెక్టర్ తెలిపారు. పాలకొండ బ్యారేజ్ పాలకొండ డివిజన్ వారితో, తోటపల్లి ప్రాజెక్టు కమిటీ వారితో సమావేశం ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. జూన్ 4న సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈఈ గనిరాజును సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సోంబాబు, బాబు, అప్పలనాయుడు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ కాలనీవాసులు నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజును కోరారు. ఈ మేరకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఆయనకు వినతిపత్రం అందించారు. కాలనీలో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, రాత్రి సమయాల్లో విషసర్పాలు సంచరించడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు.

కుట్టు శిక్షణపై దృష్టి సారించండి

సీతానగరం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళలు స్వయం ఉపాధి పొందడానికి కుట్టు శిక్షణపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బీసీ కార్పొరేషన్ ప్రతినిధి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటికే 123 మంది మహిళలు కుట్టు శిక్షణ పొందడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ముందుగా 67 మందికి గురువారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించగా 65 మంది పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ, శిక్షకులు పాల్గొన్నారు.

ఎస్‌డీఎంఎఫ్ నిధులను వెనక్కి రప్పించాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

పార్వతీపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ కాలువకు సంబంధించి ఎస్‌డీఎంఎఫ్ నిధులను వెనక్కి రప్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునికీకరణ పనుల కోసం మంజూరైన రూ.23.54లక్షలతో పనులు జరిగినట్టు ఎంబుక్‌లో నమోదు చేసి, బిల్లులు చెల్లించాలని పైఅధికారులకు పంపించినట్టు పలు పత్రికల్లో వచ్చిందన్నారు. దీనిపై ఆ శాఖ డీఈ స్పందిస్తూ బిల్లులు తయారు చేయడం వాస్తవమేనని తెలిపారన్నారు. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని, లేకుంటే నిధులు వెనక్కిపోయే పరిస్థితి ఉన్నందున ఎంబుక్‌లో నమోదు చేశారని తెలిపారని అన్నారు. అయితే డీఈ చెప్పిన కాకమ్మ కథలను పక్కనపెట్టి తక్షణమే ఎస్‌డీఎంఎఫ్ నిధులు దుర్వినియోగానికి కుట్ర చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి డిమాండ్ చేశారు.

వసతి గృహాల సందర్శన

జియ్యమ్మవలస, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జియ్యమ్మవలస, చినమేరంగి ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, అదనపు న్యాయాధికారిణి జె.సౌమ్య జోసెఫిన్ గురువారం సందర్శించారు. వసతిగృహ పరిసరాలు, పడక గదులు, మరుగుదొడ్లు, వంటగదులు పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహాలు పునః ప్రారంభించినప్పుడు మళ్లీ వస్తానని, ఈలోగా ఫ్యాన్లు, లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని వార్డెన్‌లకు సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు.

చిన్నపాటి వర్షానికే..

● రహదారిపై నిలుస్తున్న నీరు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు

పార్వతీపురంటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారిలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతుంది. దీంతో పాదచారులు, వాహనచోదకులకు ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం కురిసిన వర్షానికి ఫ్లైఓవర్ సమీపంలో గల బైపాస్ రోడ్డు నీటితో నిండిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.



పార్వతీపురం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

వర్షంతో రైతులకు ఇక్కట్లు

వీరఘట్టం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం కురిసిన వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం పెసర, నువ్వుల పంటలు చేతికందే దశలో ఉన్నాయి. అయితే వర్షం కారణంగా రైతులు పంటను కోయడానికి వీలు లేకుండా పోయింది. కోసిన పంటను ఆరవేయడానికి వీలు పడడం లేదు. ● సాలూరు రూరల్: సాలూరు ఏజెన్సీలో గురువారం మోస్తరుగా కురిసింది. రహదారులపై పోగేసిన మొక్క జొన్న పంటపై రైతులు పరదాలు కప్పారు.



వీరఘట్టం: నడుకూరులో పెసర పంటపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



సాలూరు రూరల్: మామిడిపల్లిలో మొక్కజొన్న పంటపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

కొనసాగుతున్న యోగా శిక్షణ

పార్వతీపురంటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చునని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. యోగాంధ్రలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో పలువురు యోగాసనాలు వేశారు. పలువురు ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు. ● పాలకొండ: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని యోగా మాస్టార్ ట్రైనీ కె.జనార్ధనరావు అన్నారు. సుమారు 96మంది ఐసీడీఎస్ ఉద్యోగులకు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేయించారు. పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు, ఎంపీడీవో రంగారావు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ కోఆర్డినేటర్ పావని పాల్గొన్నారు. ● సీతానగరం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడో రోజు గురువారం యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ, ఎంఈవోలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: ప్రతిరోజూ యోగ చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ఎంపీడీవో బీబీ మిశ్రో సూచించారు. గురువారం స్థానిక ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఆయుష్ వైద్యాధికారిణి నందిని, ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం యోగా శిక్షణ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఏవో డీవీ అప్పారావు, యోగా గురువులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్థానికులు



బొబ్బిలి రూరల్: యోగా చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

తోటపల్లి ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): తోట పల్లి కాలువల ఆధునికీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రైతు సంఘాల నాయకులతో కలిసి గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డితో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటుదా సు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

బీసీ రుణాలు ఇవ్వండి

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు లింకేజీ సబ్సిడీతో ఇవ్వాల్సిన రుణాలను త్వరితగతిన అందించేలా చూడాలని తూర్పుకాపు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టంకాల దుర్గారావు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్లాబ్ 1, 2, 3లో జిల్లాలో కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు రుణాలు అందించాలని ఆదేశించినా బ్యాంకులు కొంతమందికి నిరాకరించాయని తెలిపారు. వాటి స్థానంలో దరఖాస్తు చేసుకున్న కొత్త లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాల్సి ఉండగా సైట్ లింకేజీ మూసివేయడం వల్ల రుణాలు పొందడంలో జాప్యం జరుగుతుందన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

సాలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గుమడాం లేఅవుట్‌లోని పేదల కాలనీలో ఇళ్ల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని సాలూరు మున్సిపల్ ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. గుమడాం లేఅవుట్‌ను ఆయన గురువారం పరిశీలించారు. లేఅవుట్‌లో 1,337 ఇళ్ల నిర్మాణం జరగాల్సి ఉండగా స్వల్ప సంఖ్యలో నిర్మాణాలు చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మరో రూ.50వేలు అదనంగా సాయం అందిస్తున్న నేపథ్యంలో ఇళ్ల నిర్మాణం చేయాలని కోరారు.

చేతకాకుంటే తప్పుకోండి

● అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

● రసాభాసగా మండల సమావేశం

గరుగుబిల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుల విషయంలో చేతకాకుంటే విధుల నుంచి తప్పుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. గురువారం గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాగూరు ఎంపీటీసీ ద్వారపు రెడ్డి సత్యనారాయణ, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబులు మాట్లాడారు. ఉపాధిహామీలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంపై సిబ్బందిపై మండిపడ్డారు. అలాగే ఉపాధికూలీలకు 8 నెలలుగా వేతనాలు చెల్లించలేదని ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఎం.గౌరీనాథ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెల్లింపుల విషయంలో చేతకాకుంటే విధుల నుంచి తప్పుకోవాలన్నారు. పంచాయతీల పరిధిలో సర్పంచ్‌ల తీర్మానాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. సర్పంచ్‌లకు విలువ లేనప్పుడు రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భం గా ఎంపీపీ రామారావు స్పందిస్తూ ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మార్పు రాకుంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం పలువురు సభ్యులు వివిధ శాఖల్లో ఉన్న లోటుపాట్లను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలు మార్చాలి

● ఐటీడీఏ పీవోకు యూటీఎఫ్ నాయకుల వినతి

సీతంపేట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలు మార్చాలని యూటీఎఫ్ అధ్యక్షుడు ఆరిక బాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, పి.కృష్ణారావులు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్, ప్రభుత్వ, మున్సిపాల్ ఉపాధ్యాయులకు ఇచ్చిన జీవో నెం.22ను ఆచరణలో పెట్టాలని, హైస్కూల్ హెచ్‌ఎంలకు ఐదేళ్లు, మిగిలిన ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లు తప్పనిసరి చేయాలని, ఉపాధ్యాయులకు బదిలీల్లో సర్వీస్ పాయింట్లు కలపాలని, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను బదిలీ చేయగా మిగిలిన అన్ని క్యాడర్ పోస్టులలో పురుష ఉపాధ్యాయులను కూడా బదిలీ చేయాలని పీవోని కోరారు. అంతేకాకుండా ఉపాధ్యాయులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులను ఆశ్రమ పాఠశాలల్లో బదిలీ చేస్తూ జీపీఎస్(టీడబ్ల్యూ) ఉపాధ్యాయులను జీపీఎస్ పాఠశాలలకు బదిలీ చేయాలని కోరారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించినట్టు యూటీఎఫ్ నాయకులు అరినాన ప్రకాశరావు, సింహాద్రి, జయప్రకాష్ తెలిపారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన

బలిజిపేట, మే 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేసి 8 వారాలు కావస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఉపాధిహామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం బలిజిపేటలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి బిల్లులు చెల్లించాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి తక్షణమే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జల హారతిని విజయవంతం చేయండి

జియ్యమ్మవలస, మే 29 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామం వద్ద ఉన్న జంఝావతి ప్రాజెక్టు వద్ద శుక్రవారం జరగనున్న జల హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ప్రాజెక్టు సాధన సమితి కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం పార్వతీపురంలోని రాయగడ రోడ్డు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఆయన బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర శివిని, విక్రాంపురం, అర్తాం, స్వామినాయుడువలస, గంగరేగువలస, జంఝావతి జంక్షన్, రాజ్యలక్ష్మీపురం, కందివలస, కుమ్మరిగుంట, కొత్త కంబవలస, అంకుళ్లవలస, సుందరాపురం గ్రామాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

రేపు కోటదుర్గమ్మ ఆలయ హుండీల లెక్కింపు

పాలకొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన కోటదుర్గమ్మ ఆలయ హుండీలను ఈనెల 31న తెరిచి లెక్కించనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లెక్కింపులో ఆసక్తి ఉన్న భక్తులు డ్రెస్‌కోడ్ పాటిస్తూ హుండీల లెక్కింపు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. జిల్లా దేవాదాయ శాఖాధికారులు, పోలీస్, రెవెన్యూ శాఖాధికారులలు, ఆలయ అర్చకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో హుండీలను తెరిచి లెక్కించనున్నట్టు తెలిపారు.

కుడి మట్టికట్ట ప్రాంతంలోనే యోగాంధ్ర

గరుగుబిల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని కుడి మట్టికట్ట ప్రాంతంలోనే యోగాంధ్ర నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల తెలిపారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. గతంలో తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 30న యోగాంధ్ర నిర్వహించేందుకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ నిర్ణయించారన్నారు. అయితే ప్రస్తుతం వర్షాలు కురవడంతో తోటపల్లి ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న ఐటీడీఏ పార్కు ప్రాంతంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్య శాఖ, వెలుగు, ఉపాధి అధికారులు విధిగా హాజరు కావాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బలిజిపేట, మే 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు కొన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏఈ సింహాచలం గురువారం తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు మండల కేంద్రం తోపాటు పలగరా, వెంగాపురం, తుమరాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన డీఐఈవో

పార్వతీపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా వై.నాగేశ్వరరావు నియ మితులయ్యారు. ఆయన గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటర్ విద్యాప్రమాణాలు మెరుగుపర్చడం, మంచి ఫలితాలు సాధించడం పట్ల దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

కురుపాం, మే 29(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీని నిర్వహించాలని, జీవో నెంబర్3 పునరుద్ధరించాలని గిరిజన సంఘాల సభ్యులు, నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం కురుపాం తహసీల్దార్‌కు రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికలలో జీవో నెం.3ని పునరుద్ధరిస్తామని గిరిజనులకు ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని కోరారు.

సాలూరు ప్రత్యేకాధికారిగా రామారావు

సాలూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారిగా జీసీసీ డీఎం జలుమూరి రామారావు నియమితులైనట్టు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి చెప్పారు. ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు ప్రత్యేకాధికారిగా ఉన్న ఉరిటి మహేంద్ర కుమార్‌కు బదిలీ అయ్యిందన్నారు. ఆయన స్థానంలో జీసీసీ డీఎం జలుమూరి రామారావు ప్రత్యేకాధికారిగా వచ్చారని చెప్పారు.



